క్లుప్తంగా

ఎర్నిమాంబకు అష్టమి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం పుష్య మాస శుద్ధ అష్టమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 దర్శనాలు కూడా కల్పించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, జోజిబాబు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

వనితా వాకర్స్ క్లబ్‌లో మహిళా దినోత్సవం



విజేతలకు బహుమతులు అందిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీస్టార్స్ వనితా వాకర్స్ క్లబ్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు ఎంతో ప్రాధాన్యమిస్తూ సంక్షేమ పథకాలు ప్రతి మహిళా పొందేందుకు ఎంతోకృషి చేస్తున్నారన్నారు. పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వాకర్స్ క్లబ్ మహిళలకు కె.కె.రాజు నూతన వస్త్రాలు అందించారు. పలువురు ప్రముఖ మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చల్లా రజిని, ముర్రు వాణి, ఇండస్ట్రియల్ డైరెక్టర్ కాయిత వెంకటలక్ష్మి, త్రీ స్టార్స్ వనితా వాకర్స్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు పరికరాల పంపిణీకి రిజిస్ట్రేషన్

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వం ఆలిమ్‌కో సంస్థ ద్వారా ప్రవేశపెట్టిన వయోశ్రీ యోజన పథకంలో వయోవృద్ధులకు పలు పరికరాల పంపిణీ కోసం ఆదివారం కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ నమోదు కార్యక్రమాన్ని ముఖ్య అతిథి రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ప్రారంభించి మాట్లాడారు. వయోశ్రీ పథకం ద్వారా రూ.12 వేల విలువైన ఉపకరణాలను లబ్ధిదారులకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. 60 ఏళ్లు నిండి, తెల్లరేషన్ కార్డు కలిగిన దివ్యాంగ వృద్ధులకు కళ్లజోళ్లు, వీల్‌చెయిర్‌లు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, మోకాళ్ల బెల్టులు, నడుము బెల్టులు, మరిన్ని ఉపకరణాలను అందిస్తారన్నారు. అర్హులందరూ నమోదు చేయించుకోవాలని కోరారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ వివిధ లోపాలు గల వయోవృద్ధులకు ఇది ఒక మహత్తర కార్యక్రమమని ప్రశంసించారు. 2017లో ప్రారంభించిన ఈ పథకం జీవీఎల్ సహకారంతో తిరిగి ప్రారంభమైందని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు.

బుజ్జాయిల బంగారు భవితకు.. రెండు చుక్కలు

● ప్రశాంతంగా పల్స్‌పోలియో



41వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పోలియో చుక్కలు వేస్తున్న కోడిగుడ్ల పూర్ణిమ



దొండపర్తి యూపీహెచ్‌సీలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి డాక్టర్ శ్రావణి



కృష్ణాగార్డెన్స్‌లో పోలియో చుక్కలు వేస్తున్న బాపు ఆనంద్ తదితరులు



పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం

సీతమ్మధార : ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని దొండపర్తిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ శ్రావణి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి తెలిపారు. జీవీఎంసీ పరిధి 27వ వార్డు దొండపర్తి యూపీహెచ్‌సీలో పల్స్‌పోలియో కార్యక్రమం జరిగింది. 1250 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ శ్రావణి తెలిపారు. 9 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ గొంప జయదేవి, ల్యాబ్ అసిస్టెంట్ ఇస్కా, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శాలిపేట కమ్యూనిటీ హాల్లో..

మహారాణిపేట : జీవీఎంసీ 30వ వార్డు శాలిపేట కమ్యూనిటీ హాల్లో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పెంటపల్లి సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఏఎన్‌ఎం ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

41వ వార్డులో..

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో గల వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్, సచివాలయాల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాలను ఆదివారం జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ప్రారంభించారు. ముందుగా సెబాస్టియన్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. తల్లిదండ్రులు ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జేసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, వైద్య, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



కుమ్మరివీధి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కొబ్బరితోట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మహాలక్ష్మి

నిండు జీవితానికి రెండు చుక్కలు..

అల్లిపురం : ఆదివారం కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కొబ్బరితోట, పోలమాంబ అమ్మవారి దేవాలయం సమీపంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పక వేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆమెతో పాటు వార్డు సీనియర్ నాయకులు లింగం శ్రీనివాస్, లండా రమణ తదితరులు పాల్గొన్నారు.



వుడ్‌యార్డ్ స్ట్రీట్ సచివాలయంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి

కొబ్బరితోట పీహెచ్‌సీ పరిధిలో..

కొబ్బరితోట పీహెచ్‌సీ పరిధిలోని 17 కేంద్రాల్లో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యాధికారి మహాలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె కుమ్మరవీధి సచివాలయంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీ పరిధిలో 2389 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు.



కొబ్బరితోటలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న తోట పద్మావతి

భీమ్‌నగర్ పీహెచ్‌సీ పరిధిలో..

భీమ్‌నగర్ పీహెచ్‌సీ పరిధిలోని 18 కేంద్రాల్లో 2,702 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి హాజరై వుడ్‌యార్డ్ స్ట్రీట్ సచివాలయం పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కృష్ణాగార్డెన్స్‌లో 31వ వార్డు మండల అధ్యక్షుడు బాపు ఆనంద్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నీలాపు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం..

డాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గ పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో విజయవంతమైంది. నియోజకవర్గ పరిధి పలు వార్డులు, అంగన్‌వాడీ కేంద్రాలు, రామాలయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్, పీహెచ్ సెంటర్లు, ప్రధాన సెంటర్ల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా ఆరోగ్య సిబ్బంది ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. జిల్లా పరిషత్ కృష్ణ మందిరం వద్ద 28, 29, 30, 37 వార్డుల మండల అధ్యక్షుడు పీతల వాసు ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమాజమే ధ్యేయమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో శ్రీ సూర్యనారాయణమూర్తి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

అల్లిపురం : వెంకటేశ్వరమెట్టపై అలమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణ మూర్తి దేవాలయంలో మాఘ మాసం నాల్గవ ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం మందార, చామంతి, గులాబీ పుష్పాలతో స్వామి వారిని విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించి ప్రసాదాలు అందజేశారు.

ఆఖరివారం ప్రత్యేక పూజలు..

మాఘ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా 10వ తేదీన మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు పాణంగపల్లి కేశవాచార్యులు తెలిపారు. ఆ రోజు భక్తుల గోత్రనామాలతో విశేష అర్చనలు చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తరించాలని కోరారు.

అమ్మవారి ఉత్సవ బ్రోచర్ ఆవిష్కరణ



ఉత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామీజీ

అల్లిపురం : అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి వార్షిక ఉత్సవాలు ఈ నెల 7, 8 తేదీల్లో జరగనున్నాయి. ఈ మేరకు ఉత్సవ బ్రోచర్‌ను విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామీజీ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు జోగారావు శర్మ, బోరా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం

పలు వార్డుల్లో బూత్ కమిటీలతో సమావేశం



31వ వార్డులో సూచనలు చేస్తున్న మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్



39వ వార్డు సమావేశంలో పలు బూత్‌ల సభ్యులతో మైనార్టీ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్

డాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో ఆదివారం బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. 31వ వార్డులో మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్ సూచనలతో 31వ వార్డు పార్టీ కార్యాలయంలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం పేరిట కార్యక్రమం నిర్వహించారు. బూత్ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాపూ ఆనంద్ పాల్గొని అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి నాయకులు నేరుగా ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ సిటీ జనరల్ సెక్రటరీ రమణారెడ్డి, సచివాలయ కన్వీనర్లు కాండ్రేగుల నాయుడు, గణేష్, పల్లా శ్రీను, మోహన్, శ్రీదేవి, భవానీ, దుర్గ, వడ్ల శ్రీదేవి, శ్రీను, వెంకటేష్‌కుమార్, బొట్ట మహేష్ హరి, నర్సమ్మ, హేమంత్, మహేష్ గృహసారథులు పాల్గొన్నారు.

39వ వార్డులో..

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా మేము సిద్ధం.. మా బూత్‌లు సిద్ధమంటూ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు ఎం. ముజీబ్‌ఖాన్ ఆదివారం వార్డు పరిధిలో సమావేశం నిర్వహించి బూత్ అధ్యక్షులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రమణ, కమల్, ఆర్. సత్య, దూడ తాతారావు, బుజ్జి, రత్నం, రవి, వెంకట్, గిరి, కాంత, శ్రీను, మధు, గోపి, సిలార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

140 ఎపిసోడ్‌లతో 'ఘంటసాల గాన మాధుర్యం'

ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్‌చంద్ర



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వంకాయల సన్యాసిరాజు(తాతాజీ)

డాబాగార్డెన్స్: ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్‌చంద్ర సారథ్యంలో ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడల్ గంధర్వ పేరిట గాయనీగాయకుల ఎంపిక నిర్వహించారు. కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, అమెరికాకు చెందిన జి.రాము, ఎన్నారై కె.సుధారాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 10 ఏళ్ల నుంచి 90 ఏళ్ల వయసు గల ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన గాయనీగాయకులు పాల్గొని పాటలు పాడారు. వీరిలో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. త్వరలో ఘంటసాల గాన మాధుర్యాన్ని కీర్తిస్తూ ప్రసారమాధ్యమాల ద్వారా 140 ఎపిసోడ్‌లతో ప్రేక్షకుల చెంతకు ఈ కార్యక్రమం చేరుతుందని డాక్టర్ శరత్ చంద్ర ఈ సందర్భంగా తెలిపారు. వి.రాజేంద్రప్రసాద్, జీవీఎంసీ సెక్రటరీ పి.నల్లనయ్య, సుబ్రహ్మణ్య శర్మ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, జె.పృథ్వీరాజ్, మెలోడి సత్యనారాయణ, కందర్ప రాధ, నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు ఐడల్ గంధర్వ లోగో ఆవిష్కరణ

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు ఉత్తరాంధ్ర ఘంటసాల స్మారకపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్ చంద్ర నేతృత్వంలో ఐడల్ గంధర్వ లోగోను సినీ నటుడు సుమన్ ఆవిష్కరించనున్నారు. అనంతరం స్వరాభిషేకం, పాడుతా తీయగా గాయనీగాయకులతో సినీ సంగీత విభావరి, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి ధ్వని అనుకరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. జి.రాముకి జీవిత సాఫల్య పురస్కారాన్ని సుమన్ చేతుల మీదుగా అందజేయనున్నారు.

హామీల అమలుకు డిమాండ్



మహా గర్జనలో మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర చైర్మన్ నాగేశ్వరరావు

సీతమ్మధార : కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైం తదితర క్యాడర్ల ఉద్యోగులకు ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు కాంతారావు డిమాండ్ చేశారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహా గర్జన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10,177 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయటానికి ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. అందర్నీ రెగ్యులర్ చేస్తామన్న హామీ అమలు చేయాలని కోరారు. 2014 జూన్ నుంచి సర్వీసులో ఉన్న వారిని ఎన్నికల నోటిఫికేషన్ లోగా రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఆయుష్, మీసేవ, సాండ్ పాలసీలలో అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందర్నీ విధుల్లో కొనసాగిస్తు ఉత్తర్వులివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జగన్మోహనరావు, జి.కోటేశ్వరరావు, యు.కల్యాణి, దివ్య, వెంకటరావు, ఎల్వీ రమణ, పి.మణి, వి.వి.శ్రీనివాసరావు, ఆర్కేఎస్వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉదయం 9.30 గంటల నుండి స్వామి వారికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ముగ్గురిని కాపాడిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్



బర్మాకాలనీకి చెందిన వృద్ధురాలిని రక్షించిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్

డాబాగార్డెన్స్: ఆర్.కె.బీచ్, రుషికొండ బీచ్‌ల్లో ముగ్గురిని జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ రక్షించి ప్రాణాలు కాపాడారు. విశాఖ బర్మాకాలనీకి చెందిన 60 ఏళ్ల నక్కా లక్ష్మమ్మ అనారోగ్యం కారణంగా మనస్తాపంతో ఆర్.కె.బీచ్‌లో దిగి శనివారం ఆత్మహత్యకు యత్నించింది. ఇది గమనించిన లైఫ్‌గార్డ్స్ ఆమెను రక్షించారు. రుషికొండ బీచ్‌లో శనివారం సముద్రంలో చిక్కుకున్న ఇద్దరు పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ జె.హరీష్, ఎం.నవీన్, టి.పోలిరాజు, ఓ.రాజు, జి.చిన్న, అప్పన్న, కె.రాజు రక్షించి ప్రాణాలు కాపాడారు. ముగ్గురి ప్రాణాలు కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఈ సందర్భంగా అభినందించారు. శివరాత్రికి సముద్ర స్నానాలకు అధిక సంఖ్యలో భక్తులు రానున్న దృష్ట్యా ప్రమాదాలు సంభవించకుండా జీవీఎంసీ ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. బీచ్‌లో ప్రత్యేక రోబోటిక్ యంత్రాలు అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ వెల్లడించారు.

సమన్వయంతో పని చేస్తే గెలుపు తథ్యం



బూత్ కమిటీ అధ్యక్షులతో సమావేశమైన రమణారెడ్డి, బాపు ఆనంద్

అల్లిపురం : రానున్న సార్వత్రిక ఎన్నికలకు బూత్ కమిటీ సభ్యులు గృహసారథులు, వలంటీర్లతో సమన్వయంతో పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నీలాపు రమణారెడ్డి అన్నారు. మండల అధ్యక్షుడు బాపూ ఆనంద్ అధ్యక్షతన ఆదివారం పార్టీ 31వ వార్డు బూత్ కమిటీ అధ్యక్షులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కోర్ కమిటీ సభ్యులు ఆయా క్లస్టర్లలోని ఇళ్లకు మ్యాప్ చేయబడ్డ వలంటీర్లు, గృహసారథులతో కలిసి పని చేయాలని సూచించారు. కనీసం 60 శాతం ఓట్ షేర్ సాధించేలా చూడాలన్నారు. మ్యాప్ చేయబడిన అన్ని ఇళ్లను కనీసం 5 నుంచి 6 సార్లు సందర్శించేలా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాయుడు గణేష్, పల్ల శ్రీను, మోహన్, శ్రీదేవి, భవానీ, దుర్గా, శ్రీను, వెంకటేష్, కుమార్, బొట్టు మహేష్, హరి, నర్సమ్మ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శనలో చీరల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మహిళలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలో సాయిదుర్గా హ్యాండ్‌లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం చేనేత వస్త్ర, హస్తకళ ప్రదర్శన ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సెక్టార్–5లోని గిరిజన భవన్‌లో ఈ నెల 22 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రవేశం ఉంటుందన్నారు. ఏపీతో పాటు పశ్చిమబెంగాల్, కర్నాటక, రాజస్థాన్ న్యూఢిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన చేనేత ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలిపారు.

22 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



ఎంపికైన విజ్ఞాన్ ఎంబీఏ కళాశాల విద్యార్థులు

అగనంపూడి : దువ్వాడ విజ్ఞాన్ ఎంబీఏ కళాశాలకు చెందిన 22 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో డీమార్ట్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ బొడే ప్రసాద్ తెలిపారు. ఇటీవల డీమార్ట్ సంస్థ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. 22 మంది రూ.4.75 లక్షల వార్షిక వేతనంతో డిపార్ట్‌మెంట్ మేనేజర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూధనరావు, ఎంబీఏ విభాగాధిపతులు బి.చంద్ర, ఎం.మురళీకృష్ణ, తదితరులు విద్యార్థులను అభినందించారు.